## నేటి నుంచి శివనామ సంకీర్తనా తరగతులు

నల్లకుంట: శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీవేద భారతి కల్చరల్ సొసైటీ నిర్వహణలో ఈనెల 19న (నేడు) భజే శివోహం పేరిట శివనామ సంకీర్తనా తరగతులు నిర్వహించనున్నట్లు కళారత్న యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపం వద్ద ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9849053159 నంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

ముషీరాబాద్: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని మహిళా సంఘాల ప్రతినిధులు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 లక్షల కుటుంబాలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 6 లక్షల కుటుంబాలకే రేషన్ కార్డులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పేదలను మోసం చేయడమేనని పీవోడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేశ్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు సాగర్ మండిపడ్డారు. నూతన పేర్లు చేర్చడం, పెళ్లైన వారు విడిగా రేషన్ కార్డు పొందేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మనువాద పార్టీలతో జాగ్రత్తగా ఉండాలి

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు అడ్డంకిగా ఉన్న మనువాద పార్టీలతో మాదిగ కులస్తులు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని కమిషన్లు వర్గీకరణకు అనుకూలంగా ఉన్నప్పటికీ అమలుకు ఎందుకు నోచుకోవట్లేదో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు శ్రీనివాస్, శ్యామ్‌రావు, కొల్లూరు వెంకట్, చందు, తిరుమల్లేశ్, జన్నారపు జీవన్, ఎల్.నాగరాజు, కే.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

ముషీరాబాద్: టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండమైసమ్మ నగర్‌లో నివాసం ఉండే డి.ముత్తయ్య (55) వృత్తిరీత్యా కూలీపని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం ఉదయం బండమైసమ్మనగర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి ఇందిరాపార్కు వైపు వెళ్తున్న జీహెచ్ఎంసీ టిప్పర్ ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను సీజ్ చేశారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి ..



కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ–యాకుత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (40) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమగార వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన వచ్చిందని వివాహ పరిచయ వేదిక చైర్మన్ ఆర్.రోహిదాస్ వాగ్మారే తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమగార వివాహ పరిచయ వేదిక ఎనిమిదో సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా ఎంతోమంది నిరుపేదలకు పెళ్లి జరిపించామన్నారు. ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జితేందర్, ప్రధాన కార్యదర్శి మున్నాలాల్ కోక, వైస్ ప్రెసిడెంట్ పి.నందు, సెక్రటరీ ఎస్.శ్యామ్‌సుందర్, రాజ్‌కుమార్, కోశాధికారి గోవింద్, శివశంకర్, జగ్గులాల్, తుకారం, శంకర్ పాల్గొన్నారు.

## వెటర్నరీ మెడికల్ హాల్‌ను తొలగించాలి

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని మెల్కోటి పార్కులో ఏర్పాటు చేసిన వెటర్నరీ మెడికల్ హాల్‌ను తొలగించాలని స్థానికులు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కోరారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి రామన్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం పార్కును సందర్శించి స్థానికులు, వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత జి.రామన్‌గౌడ్, మెల్కోటి పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూషణ్ రావు, నేతలు పాల్గొన్నారు.

# సుందరయ్య పార్కు

● ఓవైపు పచ్చని చెట్లు ● మరోవైపు పిల్లల కోసం ఆట వస్తువులు



సుందరయ్యపార్కులో ఉన్న చెట్లు



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన సుందరయ్యపార్కు ఆహ్లాదానికి కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారింది. అసలే యాంత్రిక జీవనం, వాతావరణ కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తరుణంలో శరీరానికి ఎంతో కొంత వ్యాయామం లేకుంటే రోగాల బారిన పడాల్సిందే అన్ని రోగాలను నయం చేసుకోవడానికి, నడక, వ్యాయామం ఎంతో అవసరం అలాంటి వారికి ఈ పార్కు చక్కటి వాతావరణాన్ని కల్పిస్తుంది. వాకర్స్ నడవడానికి వాకింగ్ ట్రాక్‌తో పాటు స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడానికి పచ్చని చెట్లు, పచ్చని గడ్డి ఏర్పాటు చేశారు. ఇక సాయంత్రం అయ్యిందంటే చాలు చిన్నపిల్లలతో కిటకిటలాడుతుంది. పిల్లలు ఆడుకోవడానికి పచ్చని గడ్డితో పాటు ఇసుక, జారుడుబండ, ఉయ్యాల, భూచక్రం లాంటి పరికరాలు ఉన్నాయి. పెద్దలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి జిమ్‌తో పాటు సెటిల్ ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్ ఉంది. ఈ పార్కును 1988 డిసెంబర్ 14న అప్పటి మేయర్ అనుమల సత్యనారాయణ ప్రారంభించారు.

**ఆరోగ్య శిబిరాలు...**

◆ వాకర్స్ ఆరోగ్య పరిరక్షణకు సేత్ మాణిక్‌లాల్ ఆగర్వాల్ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు బీపీ, షుగర్ టెస్టులను ఉచితంగా చేస్తారు. అంతే కాకుండా ఇక్కడ హోమియోపతి డాక్టర్ కూడా అందుబాటులో ఉంటారు. ముఖ్యంగా వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, సెంట్రల్ ఆధ్వర్యంలో వారానికి ఒకటి, రెండు సార్లు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూత్రశాలల పరిశుభ్రంతో పాటు వాకర్స్ ట్రాక్ పరిరక్షణకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించారు. ప్రతి శుక్రవారం తెల్ల ఉప్పలమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇలాంటి పార్కు పలు పట్టణాలకు ఆదర్శంగా నిలుస్తుందని వాకర్స్ కితాబు ఇస్తున్నారు.





పార్కులో ఓపెన్ జిమ్, పిల్లల ఆటవస్తువులు

### వాకర్స్ శ్రేయస్సుకు కృషి



సుందరయ్యపార్కుకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సుమారు 5వేల వరకు జనాభా వస్తూ పోతుంటారు. వారి శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా ఉచిత ఆరోగ్య శిబిరాలతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.గుండె సంబంధించిన టెస్టులను ఉచితంగా నిర్వహిస్తున్నాం. సుందరయ్య పార్కును ఆహ్లాదంగా ఉంచడానికి తమ అసోసియేషన్ తరుపున కృషిచేస్తున్నాం.

– పీపీ నిరంజన్‌రెడ్డి, నూతన వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

### 20 ఏళ్లుగా పార్కుకు వస్తున్నా



నేను 20 ఏళ్లుగా సుందరయ్య పార్కుకు వస్తున్నాను. నా ఆరోగ్యం మంచిగా ఉండడానికి ప్రధాన కారణం ఈ పార్కు మాత్రమే. ఇక్కడ స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవడంతో పాటు ప్రతి రోజు వాకింగ్ చేసి సరదాగా స్నేహితులతో కబుర్లు చెబుతూ జీవితాన్ని కొనసాగిస్తున్నా. సెంట్రల్ యూనివర్సిటీలో నాలుగో తరగతి ఉద్యోగిగా పదవి విరమణ పొందిన తరువాత ఈ పార్కు నాకు ఎంతో తోడ్పాటును ఇస్తుంది.

– ఏ.రాజ్‌కుమార్, సీనియర్ వాకర్



## పోస్టర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాదిగ కులస్తులు గ్రంథం సమాలోచనలో భాగస్వాములు కావాలని ఆది పురుష సమాజ ప్రచార ప్రధాన ధర్మకర్త, రచయిత ఏకు తిరుపతి పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆది పురుషుడు–ఆది ధర్మం' గ్రంథానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రచయిత జూపాక సుభద్ర, అరుంధతి బంధు సేవా మండలి అధ్యక్షులు సంగీతం రాజలింగంతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ గ్రంథాన్ని త్వరలోనే కేంద్ర మంత్రుల చేతులమీదుగా ఆవిష్కరిస్తామని తెలిపారు. రాబోయే తరాలను చైతన్యం చేసేందుకు ఈ గ్రంథం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇటుక రాజు, బండి సురేందర్, నాగయ్య, స్వామి, గండి కృష్ణ, గద్ద యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ ప్రోగ్రాం ప్రారంభం



హెల్త్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న వైద్యులు మేఘన, అపూర్వ తదితరులు

కాచిగూడ: నారాయణగూడలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో ప్రొఫైలాక్సిస్ ప్రివెంటివ్ హెల్త్ ప్రోగ్రాంను ఏఐఐఎంఎస్ డాక్టర్ జుగల్ కిశోర్ వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేఘన (రూమటాలజిస్ట్), డాక్టర్ అపూర్వ (గైనకాలజిస్ట్) మాట్లాడుతూ.. ఈ ప్రోగ్రాం మొత్తం పాఠశాల సముదాయం యొక్క శారీరక, మానసిక సంక్షేమాన్ని మెరుగుపర్చేందుకు డిజైన్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో అడోలసెంట్ హెల్త్ ప్రోగ్రాం, ఫిజికల్ హెల్త్ కియోస్క్స్, మానసిక ఆరోగ్య సేవలు, కౌన్సెలింగ్ కియోస్క్స్, టెలీ మెడిసిన్ తదితర సౌకర్యాలు ఉంటాయన్నారు. ఇది ఆరోగ్యకరమైన భవిష్యత్‌ను అందించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిజిటల్ ఇన్నోవేషన్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ సీఈఓ ఆలీసైత్, పాఠశాల కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఎన్నిక




రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ

ముషీరాబాద్: ప్రగతిశీల కస్తూర్బా బాలికల విద్యాలయం (కేజీబీవీ) నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశాన్ని విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎస్.ఎల్.పద్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పి.అరుణ్‌కుమార్, ఈశ్వరి, మౌనిక, శశికళ, పుష్పలత, సహాయ కార్యదర్శులుగా అరుణ, వీరమణి, ప్రేమలత, షాహిదా, బుజ్జమ్మ, కోశాధికారిగా లక్ష్మిని ఎన్నుకున్నారు. అన్ని జిల్లాలను ప్రాతినిధ్యం చేస్తూ రాష్ట్ర కమిటీ సభ్యులుగా 21 మందికి స్థానం కల్పించారు. అనంతరం పలు నిర్ణయాలు, తీర్మానాలు చేశారు. నాన్‌టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, వీక్లీ ఆఫ్ అమలు చేయాలని, పని భారం తగ్గించాలని కోరారు.

## వర్గీకరణ, క్రిమిలేయర్‌పై చర్చించాలి

కాచిగూడ: సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై పార్లమెంట్‌లో చర్చించకుండా రాష్ట్రాల్లో వర్గీకరణ చేయవద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు డిమాండ్ చేశారు. నారాయణగూడలో శనివారం ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దళితులను సామాజికంగా, రాజకీయంగా అణిచివేసి బానిసలుగా చేసుకునేందుకే మనువాద కేంద్ర, రాష్ట్ర పాలకులు, దోపిడీ కుల పార్టీలు కుట్రలు చేశాయన్నారు. 59 ఎస్సీ కులాల ఉపకులాల జనాభా లెక్కలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిలివేరి వసంతరావు, ఎస్.అశోక్, పి.రాజలింగం, ఎం.రవీందర్ నాయక్, విశ్వనాథం, రమేశ్, ప్రసన్నకుమార్, జేఎస్ రావు, చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు షురూ



చిక్కడపల్లి: త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. త్యాగయ్య విరచిత పంచరత్న కీర్తనల గోష్టి గానం అసాంతం శ్రవణానందనంగా సాగింది. ప్రముఖ వీణా వాదన నిపుణురాలు ఆనంద రాజ్యలక్ష్మి కీర్తనలను వినిపించారు. సాయంత్రం నాట్య గురువులు తులసి, వాసుల శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో పాటు సంగీత గురువు సంయుక్త శిష్యులు శాస్త్రీయ గాన గోష్టితో ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రభుత్వ విశ్రాంత ఉన్నతాధికారి ఎం.శ్రీనివాస్, ఆనంద రాజ్యలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడుఎ జనార్దనామూర్తి, పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**శ్రీ రామగాన సభ ఆధ్వర్యంలో..**

నల్లకుంట: శ్రీ రామగాన సభ ఆధ్వర్యంలో న్యూ నల్లకుంటలోని న్యూ రామాలయం ప్రాంగణంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. సౌత్ సెంట్రల్ రైల్వే విశ్రాంత జీఎం చేబియ్యం రామకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ముందుగా మంగళవాయిద్యాం, నాదోపాసన బృందంచే దివ్య నామ సంకీర్తనల గానం నిర్వహించారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసురాలు రజినీ బృందం గాత్ర కచేరి, బెంగుళూరు వీణా కళాకారుడు బాలసుబ్రహ్మణ్యం మస్తి వీణా గానం ఆకట్టుకుంది. డాక్టర్ పి. శ్రీనివాస్ మృదంగంపై, జనార్దన్ ఘటంపై వాద్య సహకారమందించారు. ఈనెల 26 వరకు కొనసాగుతాయని శ్రీరామ గాన సభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ తెలిపారు.

## బీజేపీ అధ్యక్షుడికి సన్మానం

చిక్కడపల్లి: బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నవీన్ కుమార్‌ను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ శనివారం వేర్వేరుగా సన్మానించారు. అనంతరం గాంధీనగర్‌లో నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా నేతలు కార్యకర్తలతో కలిసి సమన్వయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో నేతలు రత్న సాయిచంద్, శ్రీకాంత్, డీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీవైఎఫ్ఐ కేలండర్ ఆవిష్కరణ

కాచిగూడ: భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావిద్, రాజయ్య, హస్మిత తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ డిజిటల్ మీడియాదే

కాచిగూడ: భవిష్యత్ డిజిటల్ మీడియాదేనని కాంగ్రెస్ సీనియర్ నేత ఫిరోజ్ ఖాన్ అన్నారు. 'ది ఎల్లో పిల్లో' ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని 'భారత్ డిజిటల్ చాంప్' ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు డిజిటల్ మార్కెటింగ్ నైపుణ్యాలు కల్పించడమే లక్ష్యంగా భారత్ డిజిటల్ చాంప్ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ది ఎల్లో పిల్లో ప్రిన్సిపాల్ అభిజిత్ కపురియా తదితరులు పాల్గొన్నారు.

## సంగీతానికి మకుటం త్యాగరాజు సంకీర్తనం

నల్లకుంట: శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ ధ్యాన మందిరంలో శ్రీ త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 69వ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. టీవీ దర్శక నిర్మాత శోభా శంకర్, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూరితో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సంగీత ప్రపంచానికి త్యాగరాజు సంకీర్తన ఒక మకుటం లాంటిదన్నారు. తెలుగు కీర్తనలతో తెలుగు ఖ్యాతిని దశ దిశలా విస్తరించిన మహనీయుడు త్యాగరాజు అని కొనియాడారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రార్థనా గీతం, స్వామి వారి అష్టోత్తర పూజ నిర్వహించారు. అలాగే సాంప్రదాయ కీర్తనల గానం, సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ పంచశత వీణా గానరత్న పోపూరి శ్రీనివాస శర్మ స్వీయ పర్యవేక్షణలో ప్రముఖ సంగీత విద్వాంసులు యశస్విని, వాసుకీదేవి, అరుణశ్రీ, విజయ్ కృష్ణల పంచరత్న కీర్తనల గానం ఆహుతులను ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై అచ్యుత కుమారి, మృదంగంపై దుర్గ కుమార్ వాద్య సహకారమందించారు. వేడుకల్లో సంగీతాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పద్మశాలీలు అన్ని రంగాల్లో ముందుండాలి

చిక్కడపల్లి: పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అశోక్‌నగర్‌లోని స్వాతంత్ర సమరయోధుడు ఆచార్యా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద పద్మశాలీ ప్రజా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్, పద్మశాలీ ప్రజా సంఘం అధ్యక్షుడు కొక్కుల సంజీవ్‌కుమార్, నేతలు గుర్రం చంద్రకళ, శంకర్, సుజాత , బింగి నవీన్ కుమార్, పున్నా సత్యనారాయణ, రాజు, బాల్లా ప్రశాంత్, అమర్‌కుమార్, బి.శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వేషన్ల పెంపు తర్వాతే

# స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల సిద్దేశ్వర్

కాచిగూడ: ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సమగ్ర కుల గణన లెక్కలు తేల్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే 42 మందితో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ యోధుల ఆమరణ నిరహార దీక్ష చేపడతామని ఓబీసీ జేఏసీ నేతలు, బీసీ హిందూ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్ అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఓబీసీ జేఏసీ నేతలు డాక్టర్ అవ్వారు వేణుకుమార్, బొమ్మ రఘురామ్ నేత, ఎస్‌పీఎస్ చారీ కోట్ల వాసుదేవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను హామీని వెంటనే అమలు చేయాలన్నారు. గ్రామ స్థాయి నుంచి బీసీలను చైతన్యం చేసేందుకు ఈనెల 19న కిలాసాపూర్ నుంచి వరంగల్ వరకు సైకిల్ యాత్ర చేపట్టి అక్కడే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. బీసీలందరూ తమ ఓట్లను బీసీ అభ్యర్థులకే వేసి ఎన్నికల్లో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ముందుగా పల్లెను గెలిచి తర్వాత ఢిల్లీని ఏలుదామనే స్లోగన్ తీసుకుని ముందుకువెళ్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఓబీసీ జేఏసీ నేతలు కొంగర నరహరి, మహేశ్ గౌడ్, కే విజయ్‌కుమార్, ఎ.అరుణ, పెండ్యాల సంపత్ పటేల్, పర్వత సతీశ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బల్వీర్‌ను సత్కరించిన కేంద్రమంత్రి



బల్వీర్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: కాచిగూడ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడు బల్వీర్‌ను బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శనివారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, శీర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్న సినిమాలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎస్.వినయ్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు చేసి చిన్న సినిమాలను ప్రోత్సహించాలని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే, తెలంగాణ సినీ ప్రేక్షకుల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న సినిమాలను ప్రోత్సహించాలంటే వరంగల్, మహబూబ్‌నగర్ లాంటి ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. ఫిల్మ్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టి ఎంట్రెన్స్ టెస్టుల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయాలన్నారు. కోర్సు పూర్తయ్యాక ప్రాజెక్టు వర్క్ చేసుకునేందుకు ప్రభుత్వం సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే మంచి సందేశాత్మక సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చి మరింత ప్రోత్సహించాలని అందుకోసం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహించడంతో పాటు తెలంగాణ సినిమా పాలసీని వెంటనే రూపొందించాలని కోరారు. సినిమా కళాకారులకు ఇండ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీఎస్‌కే అధ్యక్షులు భూపతివెంకటేశ్వర్లు, మురళీధర్ దేశ్‌పాండే, మేకల నర్సింహారెడ్డి, సుంకర సత్యనారాయణ, మదన్ లింగాల, గడ్డం సుధాకర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ జరిగినా సోదరులుగానే ఉంటాం



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ వర్గీకరణ జరిగినా మాల, మాదిగ కులస్తుల అందరం అన్నదమ్ములుగానే ఉంటామని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అరుంధతియా బంధు సేవా మండలి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ్‌రావు సంతాప సభను శనివారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. అగ్ర కులస్తులు మనల్ని విడదీసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎవరి కోటా వారు తీసుకుని ఐక్యంగా ఉందామని పిలుపునిచ్చారు. బంధు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత సేనా వ్యవస్థాపక అధ్యక్షుడు జే.బీ.రాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బీ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి దానమల్ల పవన్‌కుమార్, సెక్రటరీ జీబీ సత్యేంద్రకృష్ణ, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి ఏ.భరత్‌భూషణ్, అరుంధతి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగీతం రాజలింగం, ప్రొఫెసర్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ముషీరాబాద్: ఎస్ఆర్‌డీ, నిర్మాణ్, ఫస్ట్ సోర్స్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో భోలక్‌పూర్ డివిజన్‌లోని బడీ మసీద్ వద్ద శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. ముఖ్య అతిథిగా జీహెచ్ఎంసీ సర్కిల్–15 ఏఎంవోహెచ్ డాక్టర్ ఏ.ప్రవీణా హాజరై మాట్లాడారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నజీర్‌తో పాటు ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్ తదితర డాక్టర్లు సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్, మానిష్, సయ్యద్ మోహియుద్దీన్, బస్తీ వికాస్ మంచ్ ప్రతినిధి మునవార్ చాంద్, హాజీ పాషా, ముతావలి నజీర్ ఆలీ, ఎస్ఆర్‌డీ ప్రతినిధులు శివరాణి, ఇందిరా, భారతి, వెంకటేశ్వరీ, జబీన్ పాల్గొన్నారు.